కోట్‌పల్లి ప్రాజెక్టును ఆధునీకరిస్తాం

• 9,400 ఎకరాలకు సాగు నీరును అందించి తీరుతాం • మండల సర్వసభ్య సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, జూలై 2 : కోట్‌పల్లి ప్రాజెక్టు కింద ఉన్న 9,400 ఎకరాలకు సాగునీరు అందించి తీరుతామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని, స్థానిక రైతువేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు సర్వసభ్య సమావేశంలో ఆయాశాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో ఎజెండా అంశాలను తప్పకుండా నోట్ చేయాలని, సభ్యులు చెప్పిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎన్ని కోట్ల రూపాయలు అయినా పర్వాలేదని కోట్‌పల్లి ప్రాజెక్టును ఆధునీకరించి 9,400 ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో దాదాపు మండలంలో రూ.3 కోట్ల తో అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తామన్నారు. పదవీకాలం అయిపోయిన ఎంపీటీసీలు, జడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు నిరాశ పడవద్దని త్వరలో జరిగే ఎన్నికల సమరానికి సిద్ధం కావాలన్నారు. అనుక్షణం ప్రజల్లో ఉండేందుకు కృషి చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ అనురాధ, జడ్పీటీసీ ధారాసింగ్, వైస్ ఎంపీపీ మధులత, ఎంపీడీవో జర్నప్ప, తహసీల్దార్ కె.కిషన్, పీఆర్‌డీఈ వెంకట్‌రావు, మెడికల్ ఆఫీసర్ బుచ్చిబాబు, డీటీ మహేశ్,ఆర్ఐ రాజు రెడ్డి, సూపర్‌వైజర్ రాణి, ఆయాశాఖల అధికారులు,స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ప్రభుత్వం నిరుపేద ఆడపడుచుల పెండ్లిలకు ఆర్థిక సాయం అందించి ఆదుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు. మంగళవారం స్థానిక రైతువేదికలో 48 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

కాంగ్రెస్ సర్కార్ గద్దె దిగాలి

■ నిరుద్యోగులను మోసం చేసింది ■ బీజేవైఎం ఆందోళనలు

వికారాబాద్, జూలై 2: నిరుద్యోగుల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే వెంటనే గద్దె దిగాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరుద్యోగులతో కలిసి ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణకు నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 9 రోజులుగా నిరుద్యోగులు ఉద్యోగాల కోసం పోరాటం చేస్తున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించడం లేదన్నారు. గ్రూప్ 1లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూప్ 2, 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని విడుదల చేయాలని కోరారు. ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను వాయిదా వేసి నూతన తేదీలను ప్రకటించాలన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు. పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీవో నెం.46ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అనిల్ యాదవ్, జిల్లా జనరల్ సెక్రటరీ కార్తిక్, సాయి, జగన్నాథ్ రెడ్డి, వెంకట్, పార్టీ అధ్యక్షులు గోపాల్ రెడ్డి , నరోత్తంరెడ్డి, ఎంపీటీసీలు శ్రీకాంత్ రెడ్డి, శరణరెడ్డి, మాజీ సర్పంచ్ బుచ్చిరెడ్డి, పడిగళ్ళ రాజు, వివేక్, నరేశ్ పాల్గొన్నారు.

దోమ: నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం నాయకులు మంగళవారం దోమ మండల కేంద్రంలో తహసీల్దార్ పురుషోత్తంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం ఉపాధ్యక్షుడు ప్రకాశ్, జనరల్ సెక్రటరీ అనిల్, కార్యకర్తలు గణేశ్, హరీశ్, బాబన్న తదితరులు పాల్గొన్నారు.


వికారాబాద్ : తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

మర్పల్లి: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించాలని బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ గణేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు మధుకర్ బీజేపీ మండలాధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీశైలం, శ్రీకాంత్, నాగేశ్, శేఖర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: నిరుద్యోగ సమస్యపై బీజేవైఎం నిరంతరం పోరాడుతుందని బీజేవైఎం నవాబుపేట మండల అధ్యక్షుడు దగ్గుల శ్రీహరి గౌడ్ అన్నారు. మంగళవారం బీజేవైఎం ఆధ్వర్వంలో నిరుద్యోగ సమస్యలపై తహసీల్దార్ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీహరి గౌడ్ ఆర్‌టీఐ సెల్ కన్వీనర్ వి హనుమంత్, ఐటీ సెల్ కన్వీనర్ యు హన్మంత్, మండల ప్రధాన కార్యదర్శులు, శివచందర్‌రెడ్డి, శివకుమార్, ప్రభాకర్ చారి, ఉపాధ్యక్షులు శివప్రసాద్ గౌడ్, కారుణాకర్ కార్యదర్శులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎస్జీటీలు

బొంరాస్‌పేట, జూలై 2 : ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో భాగంగా బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులు మంగళవారం విధుల్లో చేరారు. మండలంలోని ఒక పాఠశాల నుంచి ఒక మరొక పాఠశాలకు కొందరు బదిలీకాగా ఇతర మండలాలకు కొందరు, ఇతర మండలాల నుంచి బొంరాస్‌పేట మండలానికి బదిలీ అయ్యారు. వీరందరు మంగళవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. అయితే సింగిల్ టీచర్ ఉన్న పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులను కొత్త వారు వచ్చే వరకు రిలీవ్ చేయకుండా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో కొన్ని పాఠశాలల్లో బదిలీ అయిన ఉపాధ్యాయులు డీఎస్సీ పూర్తయి నియామకాలు పూర్తయ్యే వరకు అదే పాఠశాలలో కొనసాగాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏకోపాధ్యాయ పాఠశాలలు మూతపడరాదన్న ఉద్దేశ్యంతో విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ప్రభుత్వ నిర్ణయం పట్ల బదిలీ అయిన ఎస్జీటీలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. బదిలీ అయిన టీచర్లను వెంటనే రిలీవ్ చేసి ఖాళీ అయిన పోస్టుల్లో వీవీలను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.

సర్వే నం.19లో ఎంజాయ్‌మెంట్ సర్వే

కొడంగల్, జూలై 2: మండలంలోని అప్పాయిపల్లి గ్రామ శివారు సర్వే నం.19లో రెవెన్యూ అధికారులు సోమవారం ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్, వెటర్నరీ కళాశాలకు గాను అధికారులు స్థల సేకరణ చేపడుతున్నారు. ఇందులో భాగంగా అప్పాయిపల్లి గ్రామ శివారులోని సర్వే నం.19 భూములు అనువుగా ఉండటంతో, రైతులను సంప్రదించి అభివృద్ధికి గాను భూములను ప్రభుత్వానికి అందించాలని కోరారు. ఈ క్రమంలో రైతులతో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేసి భూములను ప్రభుత్వానికి అందించేందుకు సమ్మతం తెలిపిన రైతుల భూముల్లో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ సమక్షంలో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించిన్నట్లు తసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. రైతుల హద్దుల ప్రకారం కొలతలు నిర్వహించి రికార్డుల ప్రకారం రైతుకు ఎంత భూమి ఉంది, ప్రస్తుతం రైతు ఎంత కాస్తులో ఉన్నట్లు సర్వే ద్వారా వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులతో పాటు రైతులు పాల్గొన్నారు.

నేడు కోట్‌పల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

బంట్వారం, జూలై 2: కోట్‌పల్లి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నేడు (బుధవారం) 10:30 గంటలకు బుగ్గాపూర్ లోని డీఎంఆర్ ఫంక్షన్ హాలులో ఉంటుందని మార్కెట్ కమిటీ కార్యదర్శి మల్లేశం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.. ఈ కార్యక్ర మానికి శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ రానున్నట్లు తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పది ఎకరాల వరకు ఉన్న రైతులందరికీ

రైతుబంధు ఇవ్వాలి

సమావేశంలో రైతు అభిప్రాయాలను సేకరిస్తున్న ఎంపీపీతో పాటు అధికారులు

కొడంగల్, జూలై 2: పంట పండించే రైతులకే రైతుబంధు ఇవ్వాలి అప్పుడే రైతు బంధు పథకం పూర్తి స్థాయిలో సఫలీకృతం అవుతుందని రైతులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని హస్నాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పది ఎకరాల వరకు ఉన్న రైతులందరికీ రైతుబంధు అందించాలని, అదేవిధంగా కౌలు రైతులకు కూడా రైతు బంధు వర్తింపజేయాలన్నారు. సాగులో లేని, రియల్ ఎస్టేట్ భూములకు రైతుబంధు అందించ వద్దని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పంటలను పరిశీలించి పండించే భూములను గుర్తించి రైతుబంధు వర్తింపజేస్తే రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఐటీ పేయర్స్, ప్రభుత్వ ఉద్యోగులకు రైతుబంధు అందించవద్దని తెలిపారు. అదేవిధంగా దౌల్తాబాద్ మండలంలోని బిచ్చాల్ గ్రామంలోని సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి రైతు బంధుపై సంఘం సభ్యులు, అధికారులు అభిప్రాయ సేకరణ చేపట్టారు. అదేవిధంగా ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, ఏడీఏ శంకర్‌రాథోడ్‌లు మాట్లాడుతూ రైతుబంధు పథకం అమలుపై రైతులు సరైన అభిప్రాయాలను అందిస్తేనే, మున్ముందు సరళంగా రైతుబంధు పథకం సరైన లబ్ధిదారులకు అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు అందించిన అభిప్రా యాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎస్ అధ్యక్షులు కటకం శివకుమార్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏవో లావణ్యతో పాటు సంఘం డైరెక్టర్‌లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

■ విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల అందజేత

కొడంగల్, జూలై 2: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు తమ వంతు సహాయం చేసేందుకు గాను పట్టణానికి చెందిన బాల్యమిత్రులు 2009 లో బాధ్యత సేవా సంస్థను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మండల పరిధిలోని ఐనాన్‌పల్లి, చిటప్లపల్లి, అన్నారం, లక్ష్మిపల్లి, మైసమ్మతండా, ఖాజాఅహ్మద్‌పల్లి, సంగాయిపల్లి, పోచమ్మతండాతో పాటు బొంరాస్‌పేట మండలంలోని నాస్కల్‌పల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొంటున్న 400ల మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, వాటర్ క్యాన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధ్యత సేవా సంస్థ సభ్యులు నగేస్, కిట్టుస్వామి, లక్ష్మినారాయణజోషి, మురారి వాశిష్ట, కటకం శివకుమార్, ఆనంద్ లాహోటీ, కటకం వెంకటేస్, కృష్ణారావు, వేణు, కనుకుర్తి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలి: యూటీఎఫ్

బొంరాస్‌పేట, జూలై 2 : జిల్లాలో బదిలీ అయిన ఎస్జీటీలను వెంటనే రిలీవ్ చేయాలని పాఠశాలల్లో చేరేలా అవకాశం కల్పించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గౌరారం గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బొంరాస్‌పేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్జీటీలు బదిలీ అయిన పోస్టుల్లో విద్యా వలంటీర్లను నియమించాలని కోరారు. ఉపాధ్యాయులు, పాఠశాలల రేషనలైజేషన్ ఉండదని చెప్పిన అధికారులు ఉపాధ్యాయుల బదిలీల సమయంలో పాత నిబంధనలు, జీవో 17ను ముందుకు తెచ్చి అంతర్గత రేషనలైజేషన్ ప్రక్రియను ప్రారంభించడం అసంబద్ధమైన చర్య అని దీనిని యూటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని గోపాల్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి అవసరమైన మేరకు ఉపాధ్యాయుల నియామకాలు వెంటనే చేపట్టాలని, పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు చేరేవిధంగా కృషి చేయాలని గోపాల్ కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లేశ్, కార్యదర్శి లక్ష్మయ్య, చిరంజీవి, దాలినాయుడు పాల్గొన్నారు.

మర్పల్లి, జూలై 2: కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేసినట్లు మాజీ ఎంపీటీసీ సంజీవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షానికి గుండ్లమర్పల్లి చౌరస్తా నుంచి పిల్లిగుండ్ల గ్రామానికి వెళ్లే రోడ్డు కల్వర్టులు కొట్టుకుపోయాయని వాటిని నిర్మించాలని మంగళవారం స్పీకర్‌ను కలిసి విన్నవించడంతో కలెక్టర్‌తో మాట్లాడినట్లు తెలిపారు.

చెట్టును ఢీ కొని ఒకరి మృతి

వికారాబాద్, జూలై 2 : ద్విచక్ర వాహనం చెట్టును ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రవల్లి గ్రామానికి చెందిన సొప్పరి సుదర్శన్ కుమారుడు తరుణ్(21) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. సోమవారం రాత్రి వికారాబాద్‌లో పనులు ముగిం చుకొని స్వగ్రామం ఎర్రవల్లికి వెళుతుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టాడు. ఈప్రమాదంలో తరుణ్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడి కక్కడే మరణించినాడు. గమనించిన పూలుమద్ది గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రాత్రి 2 గంటలకు వెళ్లి చూడగా తరుణ్ విగత జీవిగా పడి ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నూతన చట్టం సెక్షన్ 106(1), బి. ఎన్. ఎస్.(భారతీయ న్యాయ సంహిత) 2023 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇది వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో నూతన చట్టం ప్రకారం మొట్టమొదటి కేసు నమోదు చేశామన్నారు.

నేడు ఎమ్మెల్సీకి సన్మానం

కొడంగల్, జూలై 2: ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన నవీన్‌కుమార్‌రెడ్డితో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీలకు మంగళవారం సన్మానించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మంజునాథ బ్యాంకెట్‌హాల్‌లో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వానొస్తే మడుగే...

బొంరాస్‌పేట చౌరస్తాలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

బొంరాస్‌పేట, జూలై 2 : మండల కేంద్రంలోని భూలక్ష్మీ దేవాలయం చౌరస్తా చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతున్నది. రోడ్డుపై అక్కడక్కడ గుంతలు పడడంతో చిన్నపాటి చినుకులు కురిసినా గుంతల్లో వర్షపు నీరు నిలిచి మడుగులా మారుతున్నది. రోడ్డంతా బురదగా మారడంతో వాహనదారులు, ప్రజలు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఓపెన్ డ్రైనేజీ నిర్మిస్తే వర్షం కురిసినా వరద నీరు సాఫీగా వెళ్లడానికి ఆస్కారం ఉంటుంది. డ్రైనేజీ నిర్మించాలని, చౌరస్తాలోని గుంతల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా రోడ్డును బాగు చేయాలని చాలా రోజుల నుంచి ప్రజలు కోరుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఆలయం చౌరస్తాకు రోడ్డుకు ఇరువైపులా నివాసం ఉంటున్న వారికి కూడా డ్రైనేజీ పెద్ద సమస్యగా మారింది. అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

పరిష్కారానికి కృషి

భూలక్ష్మీ దేవాలయం చౌరస్తాలో సీసీ రోడ్డు గుంతలో ఉండడం వల్ల వర్షం నీరు నిలుస్తుంది. దీనివల్ల సమస్య వస్తుంది. జాతీయ రహదారి నుంచి బురాన్‌పూర్ క్రాస్ రోడ్డు వరకు నాలుగు లైన్ల రహదారి మంజూరవుతుంది. రహదారి విస్తరణ సమయంలో దీనిని కూడా పరిష్కరిస్తాం.

– శ్రీకాంత్‌రెడ్డి ఆర్ అండ్ బీ ఏఈ

సమాజ సేవ అదృష్టంగా భావించాలి

కొడంగల్ లయన్స్‌క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ గృహనిర్మాణ సంస్థ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి

డాక్టర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కొడంగల్, జూలై 2: సమాజ సేవ చేయడం ప్రతి ఒక్కరూ అదృష్టంగా భావించాలని రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్, కొడంగల్ లయన్స్‌క్లబ్ ఫౌండర్, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి అన్నారు. మంగళ వారం స్థానిక కేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో కొడంగల్ లయన్స్‌క్లబ్ 36వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడంగల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 36 సంవత్సరాల కాలంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించి పలువురి మన్నన లను అందుకున్నట్లు పేర్కొన్నారు. అంధత్వ నివారణకు గాను ఉచితంగా కంటి చికిత్స వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి చికిత్సలను అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రక్తదాన శిబిరాలు, ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు లయన్స్‌క్లబ్ ద్వారా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. నూతనంగా సభ్యులుగా చేరిన వారికి, నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేపట్టారు. కొడంగల్ లయన్స్‌క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడిగా మురారి వాశిష్ట, కార్యదర్శిగా కటకం శివకుమార్, కోశాధికారిగా వెంకట్‌రెడ్డి దేశ్‌ముఖ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం డాక్టర్స్ డేను పురస్కరించుకొని డా.రవీంద్రయాదవ్, డా.సాకేత్, డా. శ్రావణి, డా.నాగిరెడ్డి తదితరులకు ప్రత్యేకంగా సన్మానించారు. అదేవిధంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రగ్గులు, ఐనాన్‌పల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ మృత్యుంజయ, లయన్ డా.నటరాజ్, లయన్ ముద్దప్ప దేశ్ ముఖ్, లయన్ దాసప్పయాదవ్, లయన్ అశోక్‌కుమార్ యాదవ్, లయన్ బస్సప్పలతో పాటు లయన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అటవీ అధికారులకు కొండగొర్రె అప్పగింత

మర్పల్లి, జూలై 2 : మండలంలోని కోటమర్పల్లి గ్రామంలోని పాఠశాల వద్ద కొండగొర్రెను కుక్కలు వెంబడించాయి.. గమనించిన గ్రామస్తులు కుక్కలను తరిమేసి కొండగొర్రెను పట్టుకుని మర్పల్లి పోలీస్ స్టేషన్‌లో పోలీసులుకు అప్పగించారు. పశువైద్య అధికారులతో చికిత్స చేయించి పోలీసులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా వారు తాండూరు కార్యాలయానికి తీసుకెళ్లి అక్కడ రెండు రోజులు పరిశీలనలో ఉంచి అడవిలో వదిలేస్తామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నారాయణ, మల్లేశం, సెక్షన్ ఆఫీసర్ కిషన్, బీట్ ఆఫీసర్ వెంకటేశం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం 16K to 18K ఏజెంట్ కమీషన్ 6K. 9640258899, 9640468899.
NT-325755-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE AT CHEVELLA, R.R. DISTRICT
O.S.No. 222 of 2022
Between:
1. Mangali Harish Kumar, S/o. M. Anthaiah
2. Mangali Archana, D/o. M. Anthaiah
3. Mangali Aruna, D/o. M. Anthaiah
...Plaintiffs
AND
1. Mangali Anthaiah, W/o. M. Balaiah
2. Smt. Telugu Saritha, W/o. Ravinder
3. Smt. Telugu Chandana, W/o. Telugu Narender
...Defendants
To
Smt. Telugu Chandana, W/o. Telugu Narender
R/o. Amdapur Village, Moinabad Mandal
R.R. District, T.S. ...Defendant No.3
Whereas the above named plaintiffs filed the above case for Partition and Separate Possession against the Defendant and case is posted to 15-07-2024 for appearance of Defendant No. 3 i.e. Telugu Chandana.
If you fail to appear either in person or through an advocate on the above said date and time at 10.30 am before the Hon'ble Court and the matter will be heard and decided Exparte.
By order of the Court.
Sd/- B. RAJESHWAR, BHOGA RAHUL
Advocates
Counsels for the Plaintiffs
Offce at #13-6-955
Banjawadi, Karwan
Hyderabad-500006, T.S.

ఉచిత నాణ్యమైన వైద్య సేవలే సర్కార్ లక్ష్యం


పెద్దేముల్ : మండల కేంద్రంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

పెద్దేముల్, జూలై 2: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని మన్‌సాన్‌పల్లి, మారేపల్లి, కందనెల్లి తండా, ఎర్రగడ్డ తండా గ్రామాల్లో గ్రామ పంచాయతీ నూతన భవనాలను, మండల కేంద్రంలో రూ. కోటీ 56 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రజాప్రతి నిధులు,అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గదులను, పరిసరాలను పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుం దన్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సిబ్బంది అనుక్షణం అందుబాటులో ఉండి వైద్య సేవలను అందించాలన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన పాలనను అందించేం దుకు నూతన గ్రామ పంచాయతీ భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్,ఉపవైద్యాధికారి రవీంద్ర యాదవ్, మహేష్,ఎంపీపీ అనురాధ, జడ్పీటీసీ ధారాసింగ్,వైస్ ఎంపీపీ మధులత, మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బుచ్చిబాబు, సీహెచ్‌వో చండీశ్వరీ పాల్గొన్నారు.

మందిపల్‌లో విషాదం..

కులకచర్ల, జూలై 2: చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబ కలహాలతో తండ్రి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకోవడానికి వెళ్లగా ఆయనను కాపాడేందుకు కూతురు వెళ్లి రైలుకింద పడి ఇద్దరు మృతి చెందారు. మందిపల్ గ్రామానికి చెందిన శివానంద్(51) భార్య లావణ్య, కుమారుడు సాయి, కూతురు చందన్(20) లతో కలిసి గత 25